## క్లుప్తంగా

### ఆర్థిక సాయం

పెద్దవంగర: పేదింటి యువతి వివాహానికి కాంగ్రెస్ మండల నాయకుడు ఆర్థిక సాయం అందించి ఔదార్యం చాటాడు. మండలంలోని అవుతాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తోటకూరి శ్రీనివాస్ అదే గ్రామానికి చెందిన గద్దల రేణుక-స్వామి ప్రథమ పుత్రిక సదాకు నెల్లికుదురు మండలానికి చెందిన మురళితో వివాహం జరిగింది. వేడుకకు హాజరై పుస్తెమట్టెలకు రూ. 5,116 నగదును అందించాడు. ఆయన వెంట స్వామి, సుధాకర్, గోపాల్, ప్రభాకర్, సోమయ్య, మధు, వెంకటేష్ ఉన్నారు.

### నేడు విద్యుత్ అంతరాయం

కేసముద్రం: కేసముద్రం, రంగాపురం సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని స్థానిక విద్యుత్‌శాఖ ఏఈ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. సహకరించాలని కోరారు.

### శివాలయం పునరుద్ధరణకు విరాళం

మరిపెడ రూరల్: మండలంలోని ఎల్లంపేటలో కాకతీయుల కాలం నాటి శివాలయం పూర్తిగా శిథిలమైంది. శివాలయం పునరుద్ధరణకు అదే గ్రామానికి చెందిన దాత తాడూరి వీరన్న, రమాదేవి దంపతులు రూ.1,00,116 విరాళంగా శివాలయ కమిటీ నిర్వాహకులకు శనివారం అందజేశారు. మాజీ సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ రఘురాములు, గ్రామస్తులు ఉన్నారు.

### గుండెపోటుతో జీపీ కార్యదర్శి మృతి


రాకేష్ (ఫైల్)

గార్ల/నెల్లికుదురు : మండల కేంద్రానికి చెందిన బూర్లగడ్డ రాకేష్(30) గుండెపోటుకు గురై శనివారం మృతి చెందాడు. రాకేష్ నెల్లికుదురు మండలం ఎర్రబెల్లిగూడెం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. ఇంట్లో ఉదయం ఛాతి నొప్పి వస్తుందని తెలుపగా కుటుంబ సభ్యులు 108 వాహనంలో వరంగల్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య ఒక బాబు ఉన్నాడు.

### ముగ్గురి అరెస్ట్

మహబూబాబాద్ రూరల్ : జిల్లా కేంద్రంలోని రాజీవ్ నగర్ కాలనీకి చెందిన కాంగ్రెస్ నాయకుడు సప్పిడి రంజిత్ పై దాడిచేసి గాయపరచిన ఘటనలో ముగ్గురిని అరెస్టు చేసినట్లు టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ శనివారం తెలిపారు. శేఖర్, లక్ష్మణ్, వంశీలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు.

### యువకుడి అదృశ్యం



కురవి: మండలంలోని నేరడ శివారు కాకులబోడు జీపీకి చెందిన 20 ఏళ్ల యువకుడు బానోత్ సంతోష్ అదృశ్యమైనట్లు శనివారం ఎస్సై బి.గోపి తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. కాకులబోడు తండాకు చెందిన సంతోష్ ఫిబ్రవరి 25న ఇంట్లో ఘర్షణ పడి వెళ్లిపోయాడు. ఇప్పటి వరకు అతని జాడ కనపించడ లేదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో, బంధువుల ఇళ్లల్లో కుటుంబసభ్యులు వెతికినట్లు తెలిపారు. తల్లిదండ్రులు బానోత్ వీరన్న-బుజ్జి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### 'గృహజ్యోతి' అర్హులకు అందేలా చూడాలి

కేసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహజ్యోతి పథకాన్ని అర్హులైన వారందరికి అందేలా చూడాలని విద్యుత్ శాఖ డీఈ విజయ్ అన్నారు. మండల కేంద్రంలోని కరెంట్ ఆఫీస్‌లో కేసముద్రం సబ్‌డివిజన్ రివ్యూ మీటింగ్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహజ్యోతి స్కీంలో లబ్ధిదారులను గుర్తించి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కేసముద్రం సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. అర్పనపల్లిలో ఫెయిలైన 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించి ఓవర్ లోడ్ డీటీఆర్ ఎస్టిమేట్ వేయాలని ఏఈని ఆదేశించారు. ఏడీఈ శ్రీనివాస్, ఏఈలు శశిధర్, రాజు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

### వైకుంఠధామానికి నీటి సౌకర్యం



గార్ల: గార్ల సమీపంలోని పాకాల ఏటీ వద్ద వైకుంఠ ధామం వద్ద ఇటీవల దొంగలు ఎత్తుకెళ్లిన బోరు మోటారు స్థానంలో కొత్త మోటారును ఏర్పాటు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి కుమారస్వామి తెలిపారు. వైకుంఠధామం వద్ద 'నీటి సౌకర్యం కల్పించాలి' అనే శీర్షికన నాలుగు రోజుల క్రితం సాక్షిలో ప్రచురితమైన కథనానికి జీపీ కార్యదర్శి కుమారస్వామి స్పందించారు.

సాక్షి ఎఫెక్ట్..

# ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ రెండు పార్టీల కుట్ర

● మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు: బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను సీబీఐ అరెస్ట్ చేయడంలో రెండు జాతీయ పార్టీల కుట్ర ఉందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆరోపించారు. శనివారం డివిజన్ కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన ర్యాలీ, ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఎర్రబెల్లి మాట్లాడుతూ దేశంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం ఆయా రాష్ట్రాల్లోని ప్రతిపక్ష పార్టీల నాయకులపై కక్షపూరితంగా వ్యవహరిస్తూ సీబీఐ, ఐటీ వంటి అధికారులను అడ్డుపెట్టుకొని దాడులు చేయిస్తూ, సంబంధిత ప్రతిపక్ష పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులను భయభ్రాంతులకు గురి చేసి లొంగదీసుకునే ప్రయత్నం చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీల అధ్యక్షులు పసుమర్తి సీతారాములు, నూనావత్ నర్సింహా నాయక్, ఈదురు ఐలయ్య, ఎంపీపీలు తూర్పాటి అంజయ్య, అనిమిరెడ్డి, రాజేశ్వరి, జెడ్పీటీసీలు మంగళపెల్లి శ్రీనివాస్, రంగు కుమార్, జ్యోతిర్మిసుధీర్, తదితరులు పాల్గొన్నారు.


తొర్రూరు : ధర్నాలో పాల్గొన్న మాజీ మంత్రి ఎర్రబెల్లి


బయ్యారం : రాస్తారోకోలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్

**కవిత అరెస్ట్‌ను నిరసిస్తూ రాస్తారోకో**

బయ్యారం: ఎమ్మెల్సీ కవితను కక్షపూరితంగా అరెస్ట్ చేశారని ఆరోపిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం బయ్యారంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ బిందు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కవితను టార్గెట్‌గా చేసి అరెస్ట్ చేయటం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు గణేష్, సొసైటీ ఉపాధ్యక్షులు సత్యనారాయణ, ఐలయ్య, శ్రీను, రాము, రాజేష్, వీరన్న, వెంకన్న, లెనిన్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

గార్ల: ఎమ్మెల్సీ కవిత అక్రమ అరెస్ట్‌ను నిరసిస్తూ శనివారం గార్లలో బీఆర్‌ఎస్ శ్రేణులు రాస్తారోకో నిర్వహించారు. అనంతరం పోలీసులు వారిని అరెస్ట్ చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ పోలీస్‌స్టేషన్‌లో పార్టీ శ్రేణులతో మాట్లాడి వారిని విడిపించారు. అరెస్ట్ అయిన వారిలో ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్, రాధాకృష్ణ, మురళి, మాజీ సర్పంచ్ ధరావత్ సక్రు, లక్ష్మారెడ్డి, రమేష్, ప్రభాకర్, తదితరులు ఉన్నారు.

# బాధిత కుటుంబాలకు పరామర్శ

పెద్దవంగర: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ నెమరుగొమ్ముల సుధాకర్ రావు కుటుంబాన్ని పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి పరామర్శించారు. శనివారం మండలంలోని వడ్డెకొత్తపల్లిలోని ఆయన స్వగృహానికి ఆమె వెళ్లి సుధాకర్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఆమె వెంట మండల కాంగ్రెస్ నాయకులు ముద్దసాని సురేష్, రంగు మురళి గౌడ్, సీతారాం నాయక్, పన్నీరు వేణు, ఓరుగంటి సతీష్, దాసరి శ్రీనివాస్, బీసు హరికృష్ణ, పాల్గొన్నారు.

తొర్రూరు రూరల్: మండలంలో ఆయా గ్రామాల్లో వివిధ కారణాలతో మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ కుటుంబాలకు అండగా ఉంటామని కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ అనుమాండ్ల ఝాన్సీరెడ్డి హామీ ఇచ్చారు. శనివారం మండలంలోని చింతలపల్లి, తొర్రూరులో ఇటీవల మృతి చెందిన పార్టీ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ఆమె వెంట కాంగ్రెస్ నాయకులు మంగళపెల్లి రామచంద్రయ్య, జినుగ సురేందర్‌రెడ్డి, సుంచు సంతోష్, సోమరాజశేఖర్, పెదగాని సోమయ్య, వెంకట్‌రెడ్డి ఉన్నారు.


పెద్దవంగర : సుధాకర్‌రావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఝాన్సీరెడ్డి

## విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ



కేసముద్రం: మండలంలోని అర్పనపల్లిలో మాజీ జెడ్పీటీసీ వేం పురుషోత్తంరెడ్డి జయంతి సందర్భంగా అతని కుటుంబ సభ్యులు వేం ఉమా, వేం చేతన్, చరణ్‌లు శనివారం 11 మంది పేద విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. పక్క గ్రామమైన ఉప్పరపల్లి జెడ్పీ హైస్కూల్‌లో నడుచుకుంటూ వెళ్తున్న 8, 9, 10వ తరగతికి చెందిన పేద వారిని గుర్తించి సైకిళ్లను అందజేసినట్లు వారు తెలిపారు. అదే విధంగా 5, 6, 7వ తరగతికి చెందిన విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిల్స్ అందజేశారు.

## సంక్షిప్త సమాచారం

**క్రమం తప్పకుండా నీరందించాలి**

దంతాలపల్లి : ఈ వేసవికాలంలో ఎండలను దృష్టిలో పెట్టుకొని మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించినప్పుడే బాగుంటాయని ఎంపీడీఓ వివేక్ అన్నారు. మండలకేంద్రంతో పాటు గున్నెపల్లి, కుమ్మరికుంట్ల గ్రామాల్లో శనివారం ఆయన నర్సరీలను పరిశీలించారు.

**జీపీ సిబ్బందికి దుస్తుల పంపిణీ**

కేసముద్రం: కేసముద్రం విలేజ్‌కి చెందిన కాంగ్రెస్ మండల నాయకుడు కనుకుల రాంబాబు-సుభద్ర దంపతుల పెళ్లిరోజు సందర్భంగా శనివారం జీపీ సిబ్బందికి దుస్తులను పంపిణీ చేశారు. మేకల సురేష్, మహేందర్, రామచంద్రు పాల్గొన్నారు.

**గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు**

నెహ్రూసెంటర్ : మహబూబాబాద్ జిల్లాలోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఉచితంగా వేయనున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సుధాకర్ శనివారం తెలిపారు. ఈ నెల 15 నుంచి టీకాలు వేయనున్నందున జిల్లాలోని రైతులందరూ సమీపంలోని పశువైద్యుడిని సంప్రదించాలని తెలిపారు.

**కాంగ్రెస్ నాయకుల సంబురాలు**

గార్ల: రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి కృష్ణగౌడ్, ఎంపీపీ బట్టు నాగరాజు, పాల్గొన్నారు.

**తండాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి**

మహబూబాబాద్ రూరల్ : తండాలు, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని మల్యాల ఎంపీటీసీ బాదావత్ బద్రిచంద్రునాయక్ అన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ ఆదేశాల మేరకు మండలంలోని రేగడి తండా జీపీ పరిధిలోని తండాలో బావి పైప్‌లైను, బావ్‌సింగ్ తండాలో బోరు నిర్మాణ పనులకు శనివారం శంకుస్థాపన పూజలు చేశారు.

**ఇంటి స్థలాలు కేటాయించాలంటూ ధర్నా**

కేసముద్రం: మండలంలోని మహముద్‌పట్నం గ్రామ శివారులోని భూమికి గాను ఇంటి పట్టాలకు సంబంధించిన ఇళ్ల స్థలాలను కేటాయించాలంటూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట పలువురు లబ్ధిదారులు శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 2008లో ప్రభుత్వం తమకు ఇంటిపట్టాలు ఇచ్చిందని, తమకు ఆర్థికస్థోమత లేకపోవడంతో ఇళ్లను కట్టలేకపోయామని, దీంతో గత ప్రభుత్వం వాటిని రద్దు చేసిందని ఆరోపించారు.

**'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి**

గూడూరు: ఈ నెల 18 నుంచి జరుగబోయే పది తరగతి వార్షిక పరీక్షలకు కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల ఇన్‌చార్జ్ ఎంఈఓ డి. శ్రీదేవి తెలిపారు. ఎమ్మార్సీ కార్యాలయంలో శనివారం ఆమె మాట్లాడుతూ మండలంలో మొత్తం 14 ఉన్నత పాఠశాలల్లో 491 మంది విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. మండల కేంద్రంలోని బాలికల, బాలుర, టీడబ్ల్యూ ఏ హెచ్‌ఎస్ బాలికల పాఠశాలలను సందర్శించి పరిశీలించారు.

**కొనసాగుతున్న కుష్ఠువ్యాధిగ్రస్తుల గుర్తింపు**

కురవి: మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజి) ప్రాథమిక ఉపకేంద్రంలో కుష్ఠువ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమం శనివారం కొనసాగింది. ఇంటింటికి తిరిగి చర్మవ్యాధిగ్రస్తుల గుర్తింపు కోసం పరీక్షలు చేశారు. పారా మెడికల్ అధికారి మదుపాక ఎల్లయ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

**మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి**

తొర్రూరు రూరల్: గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కృషి విజ్ఞాన కేంద్రం మల్యాల ప్రోగ్రాం కోఆర్డినేటర్ మాలతి కోరారు. శనివారం మండలంలోని నాంచారిమడూరు రైతు వేదికలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో చిరుధాన్యాల తయారీపై నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొన్న మహిళలు ప్రత్యేక ఉపాధిని పొందవచ్చన్నారు.

**రామారావు మృతి పార్టీకి తీరని లోటు**

గార్ల: స్థానిక ఎంపీటీసీ పసుపులేటి సుజాత భర్త రామారావు హఠాన్మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. శనివారం గార్లలో నిర్వహించిన రామారావు దశదినకర్మకు ఎమ్మెల్యే హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, ఎంపీపీ బట్టు నాగరాజు, ఎంపీటీసీ ఎం వెంకట్‌లాల్, తదితరులు ఉన్నారు.

**గర్భిణులు పౌష్టికాహారాన్ని స్వీకరించాలి**

తొర్రూరు రూరల్: మహిళలు గర్భిణీ, బాలింత సమయంలో పౌష్టికాహారాన్ని స్వీకరించాలని ఐసీడీఎస్ సీడీపీఓ హైమావతి కోరారు. శనివారం మండలంలోని అమ్మాపురంలో పోషక వారోత్సవాలను నిర్వహించి, చిన్న పిల్లలకు అన్నప్రాసనం చేయించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ గర్భిణీ, బాలింతగా ఉన్నప్పుడు పాలు, గుండ్లు, ఆకుకూరలు, పండ్లు వంటి పౌష్టికాహారాన్ని తిన్నప్పుడే ఆరోగ్యవంతంగా ఉంటామన్నారు.

**కమిటీలను సమీక్షించాలి**

నెల్లికుదురు : అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను సమీక్షించి నిబంధనలు సవరించాలని టీపీటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు గుగులోతు బాలు, సంగ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని ఆలేరు పీఎస్‌లో శనివారం ఏర్పాటుచేసిన సంఘ సమావేశంలో వారు మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధి, పర్యవేక్షణ నిధుల వినియోగం వంటి పనుల కోసం గతంలో ఉన్న పాఠశాలల కమిటీల స్థానంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**ఆర్టీసీ బస్సు సౌకర్యం**

నెహ్రూసెంటర్: పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎం.శివప్రసాద్ శనివారం తెలిపారు. రాయితీ బస్సుపాస్‌లు కలిగిన విద్యార్థులు (బాలురు) హాల్ టిక్కెట్ చూపించి వారి గ్రామం నుంచి పరీక్ష సెంటర్ వరకు ఫ్రీ జర్నీకి అనుమతించబడునని తెలిపారు.

**విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు**

డోర్నకల్: మండలంలోని చిలుకోడులో శని వారం నూతనంగా నిర్మించిన ఆలయంలో గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన యాదవ మహిళలు జలబిందెలతో అభిషేకాలు నిర్వహించిన అనంతరం గర్భగుడిలో గంగమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

**ఆలయాల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి పూజలు**

కురవి: మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజి) లోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం, కురవిలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయాల్లో బీజేపీ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్ దంపతులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు రంగాభట్టార్ తీర్థ ప్రసాదాలను అందచేశారు.

**పరామర్శ**

గూడూరు: మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన బీఆర్‌ఎస్ మండల నాయకుడు ముత్యం శ్రీనివాస్‌గౌడ్ తల్లి గౌరమ్మ శుక్రవారం మృతిచెందింది. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్ శనివారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు.

**పోరాట ఫలితంగానే ఒంటిపూట బడులు**

నెహ్రూసెంటర్ : సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన పోరాటాల ఫలితంగానే అంగన్‌వాడీ కేంద్రాలకు ఒంటిపూట బడులపై సర్కార్ సర్క్యూలర్ విడుదల చేసిందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో అంగన్‌వాడీ యూనియన్ సమావేశం సంపూర్ణ అధ్యక్షతన శనివారం నిర్వహించారు.

**గ్రామాభివృద్ధికి సహకరించాలి**

దంతాలపల్లి : మండలంలోని రామానుజపురం గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేసి సహకరించాలని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని సచివాలయంలోని తన కార్యాలయంలో కలిసి శుక్రవారం వినతిపత్రం ఇచ్చినట్లు ధర్మారపు నాగేష్ తెలిపాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రామానుజపురం పాఠశాలలో మూత్రశాల, తరగతి గదులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు.

**విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..**

పెద్దవంగర: మండల కేంద్రంలోని క్రాస్‌రోడ్డు వద్ద ఉన్నటువంటి ప్రాథమిక పాఠశాల్లో స్వయం పరిపాలన దినోత్సవాన్ని శనివారం జరుపుకున్నారు. డీఈఓగా మునీశ్వర్, ఎంఈఓ ప్రసన్న కుమార్, హెచ్‌ఎంగా అఖిల, ఉపాధ్యాయులుగా తేజస్విని, అశ్విత, పానియా, హిందుప్రియ, ఇందిర ప్రియదర్శిని వ్యవహరించారు.

**గిరిజన కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం**

మరిపెడ రూరల్: ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజన కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై కాంగ్రెస్ గిరిజన యువజన నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోతు రాంచంద్రునాయక్ మరిపెడలో శాలువాతో సత్కరించారు.

# అంగన్‌వాడీలకు అవగాహన కల్పించాలి

నెహ్రూసెంటర్ : లింగ నిర్ధారణ చేయించుకోవడం నేరమని, సమాజంలో స్త్రీ, పురుషులు సమానమేనని అంగన్‌వాడీలు అవగాహన కల్పించాలని డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్ అన్నారు. ఐసీడీఎస్ మహబూబాబాద్ ప్రాజెక్టు సమావేశం శనివారం నిర్వహించగా సమావేశానికి హాజరై అంగన్‌వాడీలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్, సీడీపీఓ రాజ్యలక్ష్మి, ఎన్సీడీ కోఆర్డినేటర్ వెంకటేశ్వరరాజు మాట్లాడుతూ లింగనిర్ధారణకు పాల్పడితే వైద్యారోగ్యశాఖ అధికారులకు వెంటనే తెలియజేయాలని, టోల్‌ఫ్రీ నెంబర్ 1098, 104, 100 కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. మొదటి కాన్పులో ఆడపిల్లకు జన్మనిచ్చి మళ్లీ గర్భందాల్చిన వారిపై అంగన్‌వాడీలు నిఘా పెంచాలని సూచించారు. ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్న విషయంపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అంగనవాడీలపై ఉందని తెలిపారు. అసంక్రమిత వ్యాధుల పట్ల జాగ్రత్తలు వహిస్తూ 30 ఏండ్లు దాటిన ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ విజయలక్ష్మి, సూపర్‌వైజర్లు పద్మావతి, విజయ, జ్యోతి, ఉషారాణి, సుగుణ, సువర్ణ, దుర్గా, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

# పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన


బయ్యారంలో సీసీ రహదారి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

బయ్యారం: మండలంలోని పలు గ్రామాల పరిధిలో నిర్మించనున్న సీసీ రహదారులు, చెక్‌డ్యామ్‌లు, కాల్వల పనులకు ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య శనివారం శంకుస్థాపనలు చేశారు. బయ్యారంలో పెద్దచెరువు కాల్వల మరమ్మతుకు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో నిర్మించనున్న రహదారులకు, గౌరారం, కంబాలపల్లి పంచాయతీల్లో నిర్మించనున్న చెక్‌డ్యామ్‌ల పనుల శిలాఫలకాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం పలువురికి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేయటంతో పాటు బయ్యారంలోని రామాలయం నూతన కమిటీని సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సాధియాసుల్తానా, ఎంపీడీఓ శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ


గార్ల : విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న నాగేశ్వరరావు


మహబూబాబాద్ అర్బన్ : విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు కిట్లను పంపిణీ చేస్తున్న రామునాయక్

కురవి: సీరోలు, కురవి మండలాల్లోని వివిధ గ్రామాల విద్యార్థులకు పరీక్ష సామగ్రిని శనివారం పంపిణీ చేశారు. కురవి మండలం కొత్తూరు(జీ) శివారు తాట్య తండాలో బ్రైట్ ఇండియా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు బోడ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిల్స్‌తో పాటు ఇతర సామగ్రిని అందచేశారు. సీరోలు మండలం చింతపల్లి జెడ్పీ హైస్కూల్‌లో విప్, ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్ పంపించిన పరీక్ష సామాగ్రిని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొండపల్లి కరుణాకర్‌రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శంకర్, కాంగ్రెస్ నాయకులు మహేష్, లక్‌పతి, రామకృష్ణ, సతీష్, రామదాసు, నరేష్, చలమల రాజు పాల్గొన్నారు. అలాగే ఇదే స్కూల్ విద్యార్థులకు స్ఫూర్తి ఎడ్యుకేషనల్ వ్యవస్థాపకుడు రామసహాయం శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని అందచేశారు.

గార్ల : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు హెచ్‌ఎం నాగేశ్వరరావు పరీక్ష ప్యాడ్లను అందజేశారు. శనివారం 10 వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

దంతాలపల్లి : మండలకేంద్రానికి చెందిన సేను రాజేష్ 10వ తరగతి విద్యార్థులకు తన తండ్రి సేను భిక్షమయ్య జ్ఞాపకార్థం 230 పరీక్ష ప్యాడ్లను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ అర్బన్: గుడ్ హెల్త్ ఆర్గనేజేషన్ ఆధ్వర్యంలో మానుకోటలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో ఆర్గనేజేషన్ చైర్మన్ లావుడ్యా రామునాయక్ శనివారం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, ఇతర కిట్లను పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ భవాని, ఉపాధ్యారాలు విజయ పాల్గొన్నారు.

కేసముద్రం: కేసముద్రంస్టేషన్ జెడ్పీఎస్ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు సమ్మిగౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ శనివారం పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిల్స్ పంపిణీ చేశారు. ఇప్పటి వరకు మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో 850 మంది పేద విద్యార్థులకు, రూ.2.50లక్షల విలువైన పరీక్ష సామగ్రి అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజు, సామల నర్సయ్య, సదయ్య, సాయిగౌడ్, సంపత్, రవి, వీరేందర్, కళాధర్, మహేష్, టీచర్‌లు పాల్గొన్నారు.

మరిపెడ: మున్సిపల్ కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు స్థానిక దంత వైద్యాధికారి రాకేష్ శనివారం 100 ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ ప్రేమ్‌సాగర్, ఎస్‌ఎంసీ చైర్మన్ గండి విష్ణు పాల్గొన్నారు.

మరిపెడ రూరల్: విద్యార్థులకు పదో తరగతి పరీక్షలు తొలిమెట్టు అని కాంగ్రెస్ వీరారం గ్రామ అధ్యక్షుడు హరిసింగ్ అన్నారు. మండలంలోని వీరారం జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోతు రాంచంద్రునాయక్ బహూకరించిన పరీక్ష ప్యాడ్లను హరిసింగ్ శనివారం పంపిణీ చేశాడు.

# ప్రజాపాలన దరఖాస్తులు ఆన్‌లైన్ చేయాలి

నెహ్రూసెంటర్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న ఆరు గ్యారంటీల ప్రజాపాలన దరఖాస్తులను వెంటనే ఆన్‌లైన్ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సమ్మెట రాజమౌళి అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించి మున్సిపల్ కమిషనర్ రవీందర్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ ప్రజాపాలనలో ప్రజలు అందించిన దరఖాస్తులు పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ చేయకపోవడం, తప్పులు దొర్లడం మూలంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అల్లి శ్రీనివాస్‌రెడ్డి, కుమ్మరికుంట్ల నాగన్న, తోట శ్రీనివాస్, రాజేష్‌కుమార్, ఐలయ్య, భద్రాజీ తదితరులు పాల్గొన్నారు.


మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

# నాటిక కళారంగాన్ని ప్రోత్సహించాలి

తొర్రూరు: గ్రామీణ ప్రాంతాలకు చెందిన నాటిక కళాకారులు, కళా రంగాన్ని ప్రోత్సహించాలని అంతర్జాతీయ మైమ్ కళాకారుడు మధు కోరారు. డివిజన్ కేంద్రంలో చైతన్య కళాసమాఖ్య వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 12వ జాతీయ స్థాయి తెలుగు ఆహ్వానిత పోటీల ముగింపు కార్యక్రమంలో విజేతలైన కళాకారులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ నేటి పోటి ప్రపంచంలో ఆనాటి నాటిక పోటీలు రోజు రోజుకు అంతరించిపోతున్న తరుణంలో తొర్రూరు లాంటి ప్రాంతాల్లో అనేక ఏళ్లుగా నాటిక పోటీలు నిర్వహించి కళాకారుల ప్రతిభను వెలికితీయడం ఎంతో గొప్ప విషయమన్నారు. సమాఖ్య ప్రతినిధులు మన్నూరు ఉమ, సర్వే వెంకన్న, పనాస మధు, ప్రవీణ్, శ్రీరాం రెడ్డి, సురేష్, రామచంద్రయ్య, శ్రీనివాస్, సురేందర్‌రెడ్డి, వెంకటనారాయణగౌడ్, పాల్గొన్నారు.

# లోక్ అదాలత్‌లో 444 కేసుల పరిష్కారం

తొర్రూరు: పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 444 కేసులు రాజీ మార్గంలో పరిష్కారమయ్యాయి. జడ్జి మట్ట సరిత ఆధ్వర్యంలో పలు కేసులను పరిష్కరించారు. వీటిలో 62 క్రిమినల్, 330 పెటీ కేసులు, 48 ఎక్సైజ్, 2 సివిల్, 2 కుటుంబ కలహాల కేసులు పరిష్కారమయ్యాయి. రూ.4,87,908 కక్షిదారులకు పరిహారం కింద చెల్లించేందుకు ప్రతివాదులు ఒప్పుకున్నారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ రాజీ మార్గంలో కేసులను పరిష్కరించేందుకు లోక్ అదాలత్ వేదిక అని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోర్టు పీపీ వెంకటేశ్వర్లు, ఏజీపీ ప్రవీణ్‌రాజు, బార్ అధ్యక్షుడు సుధాకర్, ఏపీపీ గణేషానంద్, సీఐలు సంజీవ, హతీరామ్, న్యాయవాదులు పాల్గొన్నారు.


జాతీయ లోక్ అదాలత్‌లో పాల్గొన్న జడ్జి సరిత

## ఎంపీ ఎన్నికల్లో మాదిగల సత్తా చాటుదాం



గూడూరు: రెండు దఫాలుగా ఎస్సీ వర్గీకరణ చేస్తామని మోసం చేసిన బీజేపీ ప్రభుత్వానికి జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగల సత్తా చాటాలని ఎమ్మార్పీఎస్ దండోరా తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండ్ర ఎల్లయ్యమాదిగ పిలుపునిచ్చారు. గూడూరులో శనివారం జరిగిన సంఘం కార్యకర్తల సమావేశంలో ఎమ్మార్పీఎస్ దండోరా మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నెమిలి సాంబయ్యమాదిగ, ప్రధాన కార్యదర్శిగా హెప్పు శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా జనగాం అనిల్, ప్రచార కార్యదర్శిగా మైదం నాగరాజు, పోలిపాక యాకయ్య, సహాయ కార్యదర్శులుగా కొమ్ము శ్రీనివాస్, కోశాధికారిగా గద్దల బాబుమాదిగలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.